




ఎట్టకేలకు ఎక్స్‌గ్రేషియా..
గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియాను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసింది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.3 /17.7

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి స్వల్పంగా మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విమానాశ్రయం ఏర్పాటు చేయండి
- కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిని కోరిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జక్రాన్‌పల్లి వద్ద నూతన విమానాశ్రయం ఏర్పాటుకు గతంలో పంపిన ప్రతిపాదనలను పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. విమానాశ్రయం ఏర్పాటుతో చుట్టుపక్కల ప్రాంతాల అభివృద్ధి, తెలంగాణ విశ్వవిద్యాలయం, బాసర ట్రిపుల్ ఐటీకి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఉత్తర తెలంగాణలో పారిశ్రామిక, ఉద్యోగ, వ్యవసాయ రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి



సుభాష్‌నగర్: శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ అంకిత్ హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభ స్పీకర్‌గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జె ముత్తెన్న, ఎస్‌బీసీ అధికారి మధు, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

యథావిధిగా ప్రజావాణి
సుభాష్‌నగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని, ప్రస్తుతం పోలింగ్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఆర్వోబీ పనులు పూర్తి చేయాలి
- అడవి మామిడిపల్లి గ్రామస్తుల రాస్తారోకో
- దుమ్ముధూళితో వ్యాధులబారిన పడుతున్నామని ఆవేదన



మాక్లూర్: రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ఆలస్యంగా కొనసాగుతుండడంతో దుమ్ము ధూళి కారణంగా తాము ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నామని మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామస్తులు ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో 64వ నంబర్ జాతీయ రహదారిపై బైటాయించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించి 9 సంవత్సరాలు కావస్తోందని, ఇంకా కొనసాగుతూనే ఉండడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాంట్రాక్టర్ అలసత్వం కూడా ఉందని మండిపడ్డారు. దుమ్ము ధూళి కారణంగా గ్రామస్తులు అనేక మంది అనారోగ్యం పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఓపిక పట్టడం తమతో కాదని స్పష్టం చేశారు. అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేసి రైల్వే ఓవర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు



కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లు

- గెలుపోటములపై మొదలైన చర్చలు
- ఫలితాలు ఆలస్యమయ్యే అవకాశం

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను సోమవారం లెక్కించనున్నారు. గత నెల 27వ తేదీన పోలింగ్ నిర్వహించగా.. జిల్లాలో పట్టభద్ర ఓటర్లు 31,574 మందికిగాను 24,388 మంది ఓటు వేయగా, 77.24 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 3,751 మంది ఓటర్లకుగాను 3,468 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 92.46 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 15 మంది, పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 56 మంది ఉన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ఓట్లు లెక్కించనున్నారు. ప్రాధాన్యత క్రమంలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఇదిలా ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉన్న జాతీయ పార్టీల అభ్యర్థులతోపాటు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న యూనియన్ల మద్దతుదారుల గెలుపుపై జిల్లాలో చర్చలు మొదలయ్యాయి. తమ మద్దతుదారు విజయం తథ్యమని, తమకే అనుకూలంగా ఫలితాలు వస్తాయంటూ ఆయా పార్టీల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరు గెలుస్తారు, ఎవరు ఓటమిపాలవుతారో తెలుసుకునేందుకు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వేచిచూడాల్సిందే.



మీనాల వేట.. జాలరి బతుకు బాట
సాయం సంధ్యవేళలో సారంగాపూర్ చెరువు వద్ద ఈ దృశ్యం చూపరులకు కనువిందు చేసింది. సూర్యుని కిరణాలు పడి చెరువులోని నీటి అలలు మిలమిలా మెరుస్తుండగా.. నింగిలోని పక్షులు విన్యాసాలు ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు జీవనోపాధి కోసం చెరువులో ఓ మత్స్యకారుడు చేపల వేట కొనసాగిస్తున్నాడు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



28 రోజులు | 62 కోట్లు

నిజామాబాద్ కార్పొరేషన్ పన్ను వసూలు లక్ష్యం

ఆన్‌లైన్‌లోనూ చెల్లించొచ్చు
ఆన్‌లైన్‌లో కూడా చెల్లించొచ్చు పన్ను మొత్తాన్ని సంబంధించిన బిల్ కలెక్టర్‌కు నేరుగా చెల్లించి రసీదు పొందాలి. లేదా బల్దియా కార్యాలయంలో, మీసేవా కేంద్రాల్లో, ఆన్‌లైన్‌లో కూడా చెల్లించొచ్చు.



- రూ.90 కోట్లకు వసూలైంది రూ.28 కోట్లు
- పన్ను చెల్లించని బడా వ్యాపారులు
- పేరుకుపోయిన మున్సిపల్ కాంప్లెక్స్ అద్దెలు
- జోరందుకోని పన్ను వసూళ్లు
- రంగంలోకి కమిషనర్ దిలీప్‌కుమార్

ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న తరుణంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు పన్ను వసూలు పెద్ద సవాల్‌గా మారింది. కేవలం 28 రోజుల వ్యవధిలో సుమారు రూ.62కోట్లు వసూలు చేయాల్సి ఉంది. కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పన్ను వసూలు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా కమర్షియల్ కాంప్లెక్స్‌ల యజమానులు, స్టార్ హోటళ్లు, మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లు, షాపింగ్ మాల్స్, థియేటర్స్, ఫంక్షన్‌హాళ్లు తదితర వాటికి సంబంధించి పెద్ద మొత్తంలో పన్ను బకాయిలున్నాయి. వీటి వసూలు అధికారులకు కత్తిమీద సాములా మారింది.



పన్ను వసూళ్లపై మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్ (ఫైల్)

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భారీ మొత్తంలో పన్ను వసూలు చేయాల్సి ఉంది. మొత్తం రూ.90కోట్లు వసూలు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు దాదాపు రూ.28 కోట్లు వసూలయ్యాయి. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా నగరవాసులు సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో పెద్ద మొత్తంలో వసూలు కావాల్సి ఉంది. కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్ పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక టీములను రంగంలోకి దించారు. మొత్తం ఐదు సర్కిళ్లకు ఐదుగురు నోడల్ ఆఫీసర్‌లను నియమించారు. ప్రత్యేక టీములు ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పన్ను వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాయి. కమిషనర్‌తోపాటు డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి దుకాణాలు, షాపింగ్‌మాల్స్‌ను తనిఖీ చేస్తున్నారు. మాట వినని వారికి చెందిన దుకాణాలను సీజ్ చేస్తున్నారు.

మున్సిపల్ కాంప్లెక్స్ అద్దెలే ఎక్కువ

కార్పొరేషన్‌కు చెందిన అద్దె దుకాణాలు (మడిగెలు) సుమారు 500 ఉన్నాయి. కొన్నేళ్లుగా ఈ దుకాణాలను కొందరు గుత్తాధిపత్యం చేసుకుని నిర్వహిస్తున్నారు. బల్దియాకు చెల్లించేది కేవలం రూ.11,500 మాత్రమే. వీరిలో చాలా మంది తమ దుకాణాలను సబ్–లీజ్‌కు ఇచ్చారు. వారి వద్ద రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు. కానీ, బల్దియాకు చెల్లించాల్సిన అద్దెలు మాత్రం చెల్లించడం లేదు. కొందరు 2018 నుంచి అద్దెలు చెల్లించనివారు సైతం ఉన్నారు.

మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాలు..

కార్పొరేషన్‌కు చెందిన మడిగెల్లో ఓ పార్టీ కార్యాలయంతోపాటు చర్మవ్యాధుల నిపుణుల ఆస్పత్రులు, బిర్యానీ హోటళ్లు, మెడికల్స్, మొబైల్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, ఇతర వ్యాపారాలున్నాయి. ప్రతిరోజూ కస్టమర్లతో కిటకిటలాడే ఆ మడిగెలకు సంబంధించి అద్దెలు చెల్లించడంలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది. వీరికి కొందరు బల్దియా ఉద్యోగులే సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో కమిషనర్ దిలీప్‌కుమార్ నేరుగా రంగంలోకి దిగారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి పన్ను వసూలుకు వెళ్లడంతోపాటు చెల్లించని వారి దుకాణాలను సీజ్ చేస్తున్నారు. గత రెండు రోజుల్లో ఆరు దుకాణాలను సీజ్ చేశారు. ఒకే రోజు రూ.30లక్షల వరకు వసూలు చేసి మరో రూ.20లక్షలకు చెక్కులు తీసుకున్నారు.

వసూలు సాధ్యమేనా..?
కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, ఇంటి, నీటిపన్నుతోపాటు ఇతర పన్ను వసూలు చేయాల్సి ఉంది. మొత్తం రూ.90 కోట్లు అవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.28కోట్ల వరకు మాత్రమే వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మిగిలి ఉన్న 28 రోజుల్లో రూ.62 కోట్లు వసూలు సాధ్యమేనా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత నెల రోజులుగా డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. రెవెన్యూ సిబ్బందితోపాటు తాను కూడా వసూళ్లు చేపడుతున్నారు.

పన్ను చెల్లించి సహకరించాలి



నిజామాబాద్ నగర వాసులు తాము చెల్లించాల్సిన ఆస్తి, నీటి పన్ను సకాలంలో చెల్లించాలి. మార్చి 31వ తేదీ వరకు ఎదురుచూడడం సరి కాదు. కొందరు కోర్టుకు వెళ్లి తప్పించునే ప్రయత్నం చేస్తున్నారు. కేసులున్నా అద్దెలు చెల్లించాల్సిందే. నోటీసులిచ్చినా స్పందించకుంటే దుకాణాలను సీజ్ చేయక తప్పదు.

– ఎస్.దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మహాలక్ష్మికి సాయమేదీ..?

- జిల్లాలో 3,55,347 దరఖాస్తులు
- గ్యారంటీలకు నిధులు కేటాయించినా అమలుకు నోచుకోని వైనం



మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన సరిత బీడీ కార్మికురాలు. ఆమెకు పీఎఫ్ ఉన్నా గతంలో విధించిన కటాఫ్ తేదీ నిబంధన కారణంగా ఆసరా పథకం కింద జీవన భృతి అందడం లేదు. జీవనభృతికి నోచుకోకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహాలక్ష్మి సాయం రూ.2,500 అందుతుందనే ఆశతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంది. ఇప్పటి వరకు సరితకు మహాలక్ష్మి సాయం అందలేదు. ఇది ఒక్క సరితకు ఎదురైన సమస్య కాదు. జిల్లా వ్యాప్తంగా 3,55,347 మంది మహాలక్ష్మి సాయం కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. తాము అధికారంలోకి రాగానే అర్హులైన గృహిణులకు ప్రతి నెలా రూ.2,500 చొప్పున మహాలక్ష్మి పథకం కింద సాయం అందిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్‌లో ఆరు గ్యారంటీల అమలు కోసం నిధులను కేటాయించినప్పటికీ.. తమకు మహాలక్ష్మి సాయం అందించడం మరిచిపోయారని మహిళలు అంటున్నారు.

బడ్జెట్‌లో నిధులు..

రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.53,196 కోట్లను మేనిఫెస్టోలో ప్రధానమైన ఆరు పథకాల కోసం కేటాయించారు. నిధుల కేటాయింపుపై ప్రకటన చేసినా మహాలక్ష్మి సాయం పథకం విధివిధానాలను రూపొందించకపోవడంతో అనేక మంది మహిళలకు నిరాశే మిగిలింది. ఎలాంటి పింఛన్లు పొందని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళలు ప్రతి నెలా రూ.2,500 సాయం చేతికి అందితే ఎంతో ఆసరాగా ఉంటుందని భావిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలు దగ్గరపడుతున్నా గతంలో ప్రకటించిన పథకాల అమలుపై నిర్లక్ష్యం సరైంది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం స్పందించి మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలని మహిళలు కోరుతున్నారు.

మహిళా దినోత్సవం రోజునైనా...

ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ రోజున మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి శుభవార్త చెబుతారని మంత్రివర్గ సహచరులు ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'మహాలక్ష్మి'పై ప్రకటన చేసి చేయూతనందించాలని మహిళలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ అస్తవ్యస్తం

- ఎస్‌ఈ నుంచి ఈఈ వరకు ఇన్‌చార్జీలే..
- నెలకోసారైనా జిల్లా ముఖం చూడని అధికారి
- ఉన్నతాధికారి సంతకం కోసం సంగారెడ్డికి పరుగులు
- సబ్ డివిజన్‌కు ఒక్కరే ఏఈ
- పనులపై పర్యవేక్షణ కరువు
- ఖాళీలు భర్తీ అయ్యేనా..?



నిజామాబాద్ ఆర్ అండ్ బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం

నిజామాబాద్‌నాగారం: ఉన్నతాధికారి నుంచి సబ్ డివిజన్ వరకు పోస్టులు ఖాళీగా ఉండడంతో రోడ్లు, భవనాల శాఖలో పరిస్థితి అధ్వానంగా మారింది. ముఖ్యమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ), నిజామాబాద్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) పోస్టులతోపాటు డిప్యూటీ ఈఈ, ఆయా సబ్ డివిజన్లలో ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో సెక్షన్ కార్యాలయాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది.

జిల్లాకు రాని ఇన్‌చార్జి ఎస్‌ఈ

ఉమ్మడి నిజామాబాద్ (నిజామాబాద్, కామారెడ్డి) ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఎస్‌ఈగా విధులు నిర్వర్తించిన హన్మంత్‌రావు మూడు నెలల కిందటే సీఈగా పదోన్నతి, ఉద్యోగ విరమణ పొందిన విషయం తెలిసిందే. దీంతో సంగారెడ్డి జిల్లా ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) వసంత్‌నాయక్‌కు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అయితే ఆయన నెలకు ఒక్కసారి కూడా జిల్లాకు వచ్చేందుకు ఇష్టపడడం లేదని శాఖ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఫైళ్లపై సంతకాలు అవసరం ఉంటే తామే సంగారెడ్డికి వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో ఐదు సబ్ డివిజన్‌లు ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బాల్కొండ ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ ద్వారానే రోడ్ల విస్తరణ, అభివృద్ధి, బ్రిడ్జీ నిర్మాణం తదితర పనులు కొనసాగుతున్నాయి. పర్యవేక్షించాల్సిన ముఖ్య అధికారి పోస్టు మాత్రం ఖాళీగా ఉంది.

పాలన అస్తవ్యస్తం

ఆర్ అండ్ బీలో నెలల తరబడి కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో పాలన అస్తవ్యస్తంగా మారుతోంది. ఎస్‌ఈ లేకపోగా, నిజామాబాద్ డివిజన్ ఈఈ సైతం ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. సబ్ డివిజన్‌లో ఏఈలు సరిపడా సంఖ్యలో లేకపోవడంతో పనులు మూడు అడుగుల ముందుకు.. ఆరు అడుగులు వెనక్కి అన్నచందంగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలను భర్తీ చేయాలని అటు శాఖ సిబ్బంది, ఇటు ప్రజలు కోరుతున్నారు.

ఫీల్డ్ అనుభవం లేని ఈఈకి బాధ్యతలు..
నిజామాబాద్ డివిజన్ పరిధిలో బాల్కొండ, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ ఐదు సబ్ డివిజన్ కార్యాలయాలున్నాయి. ఒక్కో సబ్ డివిజన్‌కు డిప్యూటీ ఈఈతోపాటు ముగ్గురు ఏఈలు ఉండాలి. కానీ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది.

బాల్కొండ సబ్ డివిజన్‌కు డిప్యూటీ ఈఈ లేకపోవడంతో ఆర్మూర్ సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో సబ్ డివిజన్‌లో ఒక్కో ఏఈ మాత్రమే ఉండడంతో తమపై పని భారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురు చేయాల్సిన పనులు ఒక్కరే చేయడానికి నానా తంటాలు పడుతున్నారు. ఐదు సబ్‌డివిజన్‌లను పర్యవేక్షించాల్సిన ఈఈ పోస్టు గత నెల 28న ఖాళీ అయ్యింది. ఇది వరకు ఈఈగా విధులు నిర్వర్తించిన సురేశ్ పదవీవిరమణ పొందగా, సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ డిప్యూటీ ఈఈ శ్రీమాన్ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకున్నారు. ఏళ్ల తరబడి విధులు నిర్వర్తించిన అనుభవం ఆయనకు ఉన్నప్పటికీ ఫీల్డ్ అనుభవం లేదు.

నిలకడగా నీటిమట్టం
- ప్రాజెక్టులోకి చేరిన బాబ్లీ నీరు
- కాలువల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో నీరు ఎస్సారెస్పీకి చేరింది. దీంతో ఆదివారం ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా ఉంది. కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నప్పటికీ ప్రాజెక్టు నీటిమట్టం తగ్గలేదు. సుప్రీం తీర్పు ప్రకారం బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి 0.6 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి వదిలారు. మరోవైపు కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 600, లక్ష్మి కాలువ ద్వారా 250, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 472, ముంపు గ్రామాల లిఫ్ట్‌ల ద్వారా 312 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 479 క్యూసెక్కుల నీరు పోతుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1075.00(32.8టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు మరువలేనివి



నివాళులు అర్పిస్తున్న డీసీపీ బస్వారెడ్డి

ఖలీల్‌వాడి: మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు మరువలేనివని అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కమిషనరేట్ కార్యాలయంలో ఆయన జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు డీసీపీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. 1999లో మహదేవపూర్ మండలం అన్నారంలో నక్సలైట్లు ఆయనను హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన నాడు రాష్ట్రాన్ని కుదిపేసిందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(ఏఆర్) రాంచందర్ రావు, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, ఆర్ఐ(వెల్ఫేర్) శ్రీనివాస్, పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వ్యక్తి నిర్మాణ కర్మాగారమే సంఘ శాఖ

- ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ భౌతిక్ ప్రముఖ్ కృష్ణశాస్త్రి విజయభాస్కర్



మాట్లాడుతున్న కృష్ణశాస్త్రి విజయభాస్కర్

సుభాష్‌నగర్: హిందూ సమాజంలోని వ్యక్తుల్లో సంస్కారాలను నిర్మాణం చేసి తద్వారా దేశభక్తులుగా, సమాజ సంరక్షకులుగా తయారు చేసే కర్మాగారమే సంఘ శాఖ అని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ భౌతిక్ ప్రముఖ్ కృష్ణశాస్త్రి విజయభాస్కర్ పేర్కొన్నారు. కోటగల్లిలోని పద్మశాలీ హైస్కూల్‌లో పరుశురామ ప్రభాత్ శాఖ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన కృష్ణశాస్త్రి విజయభాస్కర్ మాట్లాడుతూ కార్యకర్తల వికాసానికి సంఘ శాఖ తోడ్పాటునందిస్తుందని, శాఖ ద్వారా స్వయంసేవకుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్యం ఏర్పడతాయని తెలిపారు. ఆటాపాటల వ్యక్తిలో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించడమే సంఘ శాఖ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. విత్తనం మహావృక్షంగా మారినట్లే, సంఘ శాఖ కూడా హిందూ సమాజానికి పునాది రాయి లాంటిదని, సంఘ శాఖల ద్వారానే హిందూ సమాజం చైతన్యవంతమైందని తెలిపారు. ఈ సందర్భంగా స్వయం సేవకులు నిర్వహించిన సంచలన్, శారీరక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నగర కార్యవాహ అరుగుల సత్యం, సహ కార్యవాహలు సుమిత్, వెంకటేశ్, భద్రయ్య, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులతో మరింత పాడైన రోడ్డు



గాంధారి-బాన్సువాడ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

గాంధారి(ఎల్లారెడ్డి): మరమ్మతుల పేరుతో గాంధారి–బాన్సువాడ ప్రధాన రహదారిని మరింత చెడగొట్టారు. రోడ్డు పాడైపోయి అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుకు వారం రోజుల క్రితం విచిత్రమైన మరమ్మతులు చేశారు. దీంతో ప్రయాణికులకు మరింత ఇబ్బంది కలుగుతోంది. మరమ్మతుల్లో భాగంగా చిన్నగా ఉన్న గుంతలను పొక్లెయిన్‌తో మరింత వెడల్పు, లోతు తీశారు. గుంతల్లో దొడ్డు కంకర వేసి వదిలేశారు. దీంతో వాహన రాకపోకలకు వేసిన కంకర, బాగున్న తారు రోడ్డుపై కొంత, పక్కలకు కొంత ఎగిరిపోయింది. రోడ్డుపై కంకర ముక్కల కారణంగా పలు ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు కంకర ముక్కలు ఎగిరి పక్కనున్న వారికి తగులుతున్నాయి. మొత్తం కంకర ఎగిరిపోయిన చోట పొక్లెయిన్‌తో తీసిన గుంతలు లోతు కావడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. సంబంధిత అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎట్టకేలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపు

- నిజామాబాద్ జిల్లాలో 28, కామారెడ్డిలో నాలుగు కుటుంబాలకు అందిన సాయం
- కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు



ఎక్స్‌గ్రేషియా విడుదల చేసే అంశంపై అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి(ఫైల్)

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంది. గల్ఫ్ దేశాల్లో మరణించిన వలస కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన మాటను సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సొమ్మును ఖాతాల్లో జమ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని 28, కామారెడ్డి జిల్లాలోని నాలుగు కుటుంబాలకు సాయం అందింది. జిల్లాకు రూ.1.75 కోట్లు కేటాయించారు. అంటే 35 కుటుంబాలకు సాయం అందనుంది. ఏడాది కాలంగా గల్ఫ్ దేశాల్లో మరణించిన వారిలో జిల్లా వాసులే ఎక్కువ మంది ఉండటం గమనార్హం. ఇప్పటి వరకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేసిన 28 కుటుంబాలకు సాయం సొమ్ము జమ చేశారు. కేటాయించిన నిధుల్లో మరో ఏడు కుటుంబాలకు సాయం అందించడానికి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సి ఉంది. ఆలస్యంగానైనా గల్ఫ్ మృతుల కుటుంబాలకు సాయం అందించడంతో వలస కార్మికుల సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

రుణపడి ఉంటాం



గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ. ఐదు లక్షల చొప్పున సాయం అందించడంతో సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం. గల్ఫ్ మృతుల్లో అత్యధికులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుంది. వైఎస్సార్ తర్వాత ఇంతటి సాయం అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి కావడం విశేషం.

– మంద భీంరెడ్డి, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్

గల్ఫ్ వలసదారులకు ఎంతో మేలు



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు అమలయ్యాయి. ఇందులో గల్ఫ్ మృతుల కుటుంబాలకు సాయం అందించడం ఎంతో ప్రధానమైనది. ఇక్కడ ఉపాధి లేక గల్ఫ్‌కు వలస వెళ్లిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం గొప్ప విషయం.

– తక్కూరి సతీశ్, కాంగ్రెస్ నాయకులు, మోర్తాడ్

పన్నెండు మందికి ఎక్స్‌గ్రేషియా మంజూరు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ: గల్ఫ్‌లో మృతి చెందిన నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పన్నెండు మంది మృతుల కుటుంబాలకు రూ. ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరైనట్లు రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. సిరికొండ మండలంలోని రావుట్లలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గల్ఫ్‌లోని వివిధ దేశాల్లో నియోజకవర్గానికి చెందిన 15 వేల ఉపాధి కోసం వలస వెళ్లారని తెలిపారు. అక్కడ అసువులు బాసిన మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం చెప్పినట్లుగా నష్టపరిహారం మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎజెండాలో చెప్పినట్లుగా గల్ఫ్ అడ్వయిజరీ బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధికి పాటుపడకుండా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు నిధుల గురించి ప్రధానిని నిలదీయాలని, తెలంగాణ అభివృద్ధికి నిధుల కోసం పార్లమెంట్ ఎదుట ధర్నా చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, చందర్‌నాయక్, బాకారం రవి, రాజారెడ్డి, గంగాధర్, సంతోష్, మల్లేశ్‌యాదవ్, సామేల్, సంతోష్‌నాయక్, రమేశ్, ప్రసాద్, లింగం, శ్రీనివాస్, బడాల మహిపాల్, గంగారెడ్డి, దాసు, భాస్కర్, బన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు



ట్రోఫీ అందుకుంటున్న బాలుర జట్టు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, బాలుర జట్టు తృతీయస్థానంలో నిలిచింది. ఫిబ్రవరి 28 నుంచి ఈ నెల 2 వరకు సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన పోటీల్లో జిల్లా బాలికల జట్టు ప్రథమ స్థానంలో, బాలుర జట్టు తృతీయ స్థానంలో గెలుపొందినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజేత జట్లకు ట్రోఫీలను అందజేశారు. జట్లకు కోచ్ మేనేజర్లుగా నరేశ్, అనికేత్, సంతోష్, సాయి కుమార్ వ్యవహరించారు.



ఆలూర్ 2002-03 పదోతరగతి పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

పెర్కిట్/ ధర్పల్లి: ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరానికి చెందిన పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను సన్మానించా రు. ధర్పల్లి మండలం హోన్నాజీపేట్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులను సన్మానించారు.



హోన్నాజీపేట్ 1999-2000 పదో తరగతి పూర్వ విద్యార్థులు

హలధారికి ఆధునిక అండ

- సాగులో సాంకేతిక విప్లవం
- పురుగు మందుల పిచికారీకి డ్రోన్ స్ప్రేయర్ వినియోగం



డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ

సిరికొండ: అధునాతన యంత్రాల వినియోగంతో పంటల సాగు తీరు మారుతోంది. కాలానికి అనుగుణంగా అన్నదాతలు ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నారు. పంటలకు పురుగు మందులను పిచికారీ చేసేందుకు గతంలో చేతిపంపులనే వినియోగించేది. క్రమంగా చార్జింగ్, పెట్రోల్‌తో నడిచే స్ప్రే పంపులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం డ్రోన్ స్ప్రే యంత్రాలను పురుగు మందుల పిచికారీకి వినియోగిస్తున్నారు. మండలంలోని గడ్కోల్, నర్సింగ్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు డ్రోన్లను కొనుగోలు చేసి స్ప్రే చేసేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఒక్క డ్రోన్ కొనుగోలుకు ఆరు లక్షల వరకు ఖర్చవుతోంది. గతంలో పెట్రోల్ పంపుల ద్వారా ఎకరం పొలానికి స్ప్రే చేసేందుకు గంటల తరబడి సమయం పట్టేది. ప్రస్తుతం అరగంట వ్యవధిలోనే ఎకరం పొలానికి డ్రోన్ ద్వారా మందుల పిచికారీ పూర్తవుతుండడం విశేషం.

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి



రెంజల్‌లో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్: చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆదివారం రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గాం, రెంజల్ గ్రామాలను సందర్శించి రైతులతో సాగు నీటి అవసరాలపై ముచ్చటించారు. అలీసాగర్ ద్వారా విడుదల చేస్తున్న నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పంటలు ఎండకుండా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయం జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటూ, కాల్వలపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బోర్గాం రైతులకు కందకుర్తి ఎత్తిపోతల ద్వారా నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోనే చక్కెర ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు చెరుకు పంట సాగుకు ముందుకు రావాలని సూచించారు.

ఎన్నికల్లో సమర్థులను ఎన్నుకోవాలి

స్థానిక సంస్థలకు నిర్వహించే ఎన్నికల్లో సమర్థులైన వారినే ఎన్నుకునాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రైతులకు సూచించారు. వారిచ్చే డబ్బులకు ఆశపడితే గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. అనంతరం తాడ్‌బిలోలిలో బాధిత కుటుంబానికి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాగభూషణం రెడ్డి, సాయారెడ్డి, మొయినొద్దీన్, సాయిబాబాగౌడ్, జావీద్, నితిన్, మర్ల రమేశ్, కుర్మె శ్రీనివాస్, కిరణ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట భూములకు నీరందిస్తాం

నవీపేట: నిజాంసాగర్ చివరి ఆయకట్టు భూములకు పుష్కలంగా సాగు నీరందిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నవీపేట, జన్నెపల్లి శివారులోని పంట భూములను పరిశీలించారు. విడతల వారీగా వస్తున్న అలీసాగర్ ఎత్తి పోతల నీటిని పంట భూములకు వాడుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, సాయారెడ్డి, భగవాన్, గోపాల్, సంజీవ్‌రెడ్డి, సురేశ్, గౌరురాజు తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువుకు పెరిగిన డిమాండ్

- ఒక్క లారీ ఎరువు ధర రూ. 36 వేలు



కొత్తపల్లిలో లారీలోంచి ఎరువును తవ్వుతున్న కూలీ

బాల్కొండ: సేంద్రియ ఎరువులకు డిమాండ్ బాగా పెరిగింది. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు రావడంతో రైతులు అనేక పద్ధతులు అవలంభిస్తూ పంటలను సాగు చేస్తున్నారు. దాంట్లో భాగంగానే రైతులు సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేస్తున్నారు. గొర్రెల, మేకల పేడనే అధికంగా వినియోగిస్తున్నారు. ఒక్క లారీ ఎరువు ధర రూ. 36 వేలు పలుకుతోంది. ఎకరం భూమికి కనీసం రెండు లారీల ఎరువును వేయాలని రైతులు అంటున్నారు. దీంతో పాటు నల్ల మట్టి, రసాయన ఎరువులు కూడా వినియోగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సేంద్రియ ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పోషకాలు ఎక్కువగా ఉండటంతోనే..

గొర్రెల, మేకల పేడలో పోషకాలు ఎక్కువగా ఉండటంతోనే డిమాండ్ ఉంటుందని వ్యవసాయ అధికారులు అంటున్నారు. ప్రధానంగా వెచ్చదనం ఎక్కువగా ఉంటుంది. దీంతో తేమ శాతం ఎక్కువగా ఉన్న నేలల్లో ఈ ఎరువు మంచిగా పని చేస్తుంది. పసుపు భూమిలో ఉండే పంట కావడంతో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో పంటకు దుంపకుళ్లు సోకే ప్రమాదం ఉంటుంది. గొర్రెల, మేకల పేడను ఎక్కువగా వినియోగిస్తే వెచ్చదనం ఎక్కువగా ఉండటం వలన తేమ శాతం ఎక్కువగా ఉండదు. ఈ ఎరువులో ప్రధాన, సూక్ష్మ పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. దీంతో ధర అధికంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. సేంద్రియ ఎరువును సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధరలు ఎక్కువగా అయ్యాయి

సేంద్రియ ఎరువుల ధరలు ఎక్కువగా అయ్యాయి. లారీ ఎరువు రూ. 36 వేలు పలుకుతుంది. పసుపు పంటను సాగు చేసేందుకు వీటిని తప్పకుండా పోయాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వం సేంద్రియ ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలి.

– గంగారెడ్డి, రైతు, కొత్తపల్లి

రంజాన్ ఉపవాస దీక్షలు షురూ

నిజామాబాద్ రూరల్: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైంది. శనివారం సాయంత్రం నెలవంక దర్శనం ఇచ్చింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ముస్లిములు నెల రోజుల పాటు రంజాన్ ఉపవాస దీక్షలను చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం దేశవ్యాప్తంగా నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు మతపెద్దలు తెలిపారు. ప్రార్థనల కోసం ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని మసీదులు ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని అన్ని మసీదులు ముస్లిములతో సందడిగా మారాయి. రంజాన్ పండుగ ప్రారంభాన్ని పురస్కరించుకొని మసీదుల్లో ఇషా నమాజ్ తర్వాత తరవీహ్ (రంజాన్ ప్రత్యేక నమాజు)ను ఆచరిస్తారు. రంజాన్ సందర్భంగా ముస్లిం ఇమామ్(మత గురువు)లు ప్రత్యేక నమాజులలో భాగంగా ఖురాన్ పారాయణాన్ని మొదలుపెడతారు. ఉపవాసాలు ముగించేందుకు ఇఫ్తార్‌కు అవసరమైన ఖర్జూరాలు, పండ్లు విక్రయించేందుకు పలుచోట్ల దుకాణాలు వెలిశాయి.

దేగాంలో యువకుడిపై కత్తిపోట్లు



కత్తిపోట్లతో గాయపడిన నాగరాజుకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో ఆదివారం ఐనార్ల నాగరాజు అనే యువకుడిపై గ్రామానికి చెందిన కొందరు పాత కక్షలతో పదునైన ఆయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుని తండ్రి గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేగాంకు చెందిన గంగరాజు, అతని సోదరునికి గ్రామానికి చెందిన దగ్గరి బంధువులతో రెండేళ్ల క్రితం గొడవలు ఏర్పడ్డాయి. ఇరువర్గాల గొడవ కుల పంచాయితీకి రాగా గంగరాజు కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారు. ఈ విషయమై అతను పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా గంగరాజు కుటుంబంపై దగ్గరి బంధువులకు విద్వేషం ఇప్పటికి కొనసాగుతోంది. గంగరాజు సోదరుడు ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో ఆదివారం గంగరాజు కుమారుడు నాగరాజు పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా లక్ష్మీ నరసింహ ఆలయం వద్ద బంధువులైన శ్రీకాంత్, శ్రీధర్, క్రాంతి, అయినార్ల అశోక్, అయినార్ల శేఖర్, శ్రీలత, బద్దెమ్మలతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అందరూ నాగరాజును ఆయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అలాగే నాగరాజుపై దాడి చేసిన వారు సైతం గాయపడ్డారు. తీవ్ర గాయాలపాలైన నాగరాజును తండ్రి గంగరాజు ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. నాగరాజుకు చికిత్సలు చేస్తున్న సమయంలో ఘర్షణలో గాయపడ్డవారు సైతం ఆస్పత్రికి వచ్చారు. మళ్లీ వారు నాగరాజుపై దాడి చేయడానికి యత్నించారు. ఆస్పత్రిలో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో వైద్య సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని నాగరాజును మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు. కాగా ఎస్‌హెచ్‌వో సత్య నారాయణగౌడ్ మాట్లాడుతూ ఘర్షణపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

మూడు ఇళ్లలో చోరీ



తాడ్వాయిలోని ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

తాడ్వాయి: మండల కేంద్రంతోపాటు బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం రాత్రి తాళం వేసిన మూడు ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయికి చెందిన బాయికాడి శరత్ శనివారం తన ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లాడు. ఇంటికి తాళం ఉండడంతో దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. రూ. ఐదు వేల నగదు, నాలుగున్నర తులాల బంగారం, పది తులాల వెండిపట్ట గొలుసులు చోరీకి గురయ్యాయి. అదేవిధంగా పక్కనే ఉన్న గడ్డల సావిత్రి ఇంటికి సైతం తాళం వేసి ఉండడంతో దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ. 18వేల నగదు, మూడు మాసాల బంగారు మాటీలు, రెండుమాసాల ఉంగరం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. తాడ్వాయికి చెందిన సుర్కంటి ప్రతాపరెడ్డి తనబైక్‌ను ప్రతిరోజు మాదిరిగానే తన ఇంటి ఎదుట రాత్రి ఉంచి పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి దుండగులు బైక్‌ను దొంగిలించినట్లు తెలిపారు. అలాగే మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కుర్మతిరుపతికి చెందిన ఇంట్లో చోరీ జరిగిందని గ్రామస్తులు తెలిపారు. రూ. 18లక్షల నగదును చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలాలకు చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని సాలూర క్యాంప్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మందర్న గ్రామంలో రాజేందర్(25) అనే యువకుడు అప్పుల బాధతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మృతుడి తండ్రి మల్లుగొండ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



అనిల్ మృతదేహం

పిట్లం: మద్యానికి బానిసైన ఓ యువకుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండలంలోని కోమటి చెరువు తండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమటి చెరువు తండాకు చెందిన రమావత్ అనిల్ (22) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంమీద విరక్తితో శనివారం రాత్రి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి తులసిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సాలూర లిఫ్ట్ ఇరిగేషన్‌లో దొంగల బీభత్సం

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మంజీర నది ఒడ్డున ఉన్న సాలూర లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద దొంగలు బీభత్సం సృష్టించారు. ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సాలూర లిఫ్ట్ ఇరిగేషన్‌లో శనివారం అర్ధరాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించేందుకు ఎనిమిది మంది గుర్తు తెలియని దుండగులు విఫలయత్నం చేశారు. అక్కడే ఉన్న ఆపరేటర్ లక్ష్మణ్, వాచ్‌మన్ నర్సయ్య కేకలు వేయడంతో వారిపై దొంగలు దాడికి పాల్పడ్డారు. ఆపరేటర్, వాచ్‌మన్‌లను అక్కడే ఉన్న గదిలో బంధించారు. ఆపరేటర్ లక్ష్మణ్ సెల్‌ఫోన్‌ను లాక్కొని అక్కడి నుంచి పరారీ అయ్యారు. ఈ ఘటనపై ఆదివారం లిఫ్ట్ ఇరిగేషన్ అధికారి బస్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి పేర్కొన్నారు.